క్లుప్తంగా

మీజూరులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



పరీక్షలకు పేర్లు నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు

దొరవారిసత్రం : మండలంలోని తొగరాముడి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న మీజూరు గ్రామంలో శుక్రవారం తిరుపతి స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. పురుషులు, మహిళలల్లో నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేశారు. మద్యం, గుట్కా, సిగరేట్‌కు దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. డాక్టర్లు చైతన్య, తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్నానపు గదుల నిర్మాణానికి భూమి పూజ



చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తగిన స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు వాటిని నిర్మించడానికి ముందుకు వచ్చారు. స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ట్రస్టు ప్రతినిధులు రాజనేని రామానాయుడు, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం



రాపూరు: రాపూరు అటవీశాఖ రేంజ్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు నెల్లూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. వారిని శుక్రవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో రేంజర్ రవీంద్రబాబు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నెల్లూరు నుంచి బదిలీపై వచ్చిన చక్రపాడి, చంద్రశేఖర్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్లు మస్తానయ్య, ఖాజారసూల్, బాలాజీ, సెక్షన్ అధికారులు వరప్రసాద్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



సందీప్‌కుమార్‌ను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కే.సందీప్‌కుమార్‌కు జేఎన్‌టీయూఏ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన ఏ స్టడీ ఆన్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ మోడిఫైడ్ విత్ ఫెర్రో సిలికా స్లాగ్ అగ్రిగేట్ అండ్ పారాఫిన్ వాక్స్ క్యూరింగ్ కాంపౌండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆన్సిస్ మోడల్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయనను శుక్రవారం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెడ్‌వోడీ శ్రీనివాస్ అభినందించారు.

త్వరితగతిన గృహ నిర్మాణ పనులు

సైదాపురం: మండలంలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం మండల స్థాయి అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. అలాగే వెలుగు పథకం ద్వారా లబ్దిదారులకు రూ.30 వేల రుణం ఇవ్వడంతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పని దినాలు కల్పించాలని తెలిపారు. ఏవో భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునిమనోజ్ తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

కోట: తీరప్రాంతంలోని ప్రభుత్వ భూములను శుక్రవారం తహసీల్దార్ జయజయరావు పరిశీలించారు. ఇక్కడ సాగరమాల రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు కొందరు రైతులు ఇష్టపడడం లేదు. ఈ క్రమంలో తహసీల్దార్ భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాగరమాల రోడ్డుకు పల్లెవానిదిబ్బ, యమదిన్నెపాళెంలో 25 ఎకరాల భూములు కావాలని, సంబంధిత రైతులు వాటిని అప్పగిస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకువాలన్నారు. వీఆర్‌వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన వీఆర్‌ఏలు

సైదాపురం: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఈ.రమాదేవిని శుక్రవారం గ్రామ రెవెన్యూ సహాయకులు కలిశారు. ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. తమ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సేవకుల అధ్యక్షుడు అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సముద్రపు ఒడ్డున మృతిచెందిన తాబేళ్లు(ఫైల్)







రొయ్యల హేచరీస్‌లు, రొయ్యల చెరువుల నిర్వాహకులు, పర్యాటకుల నిర్లక్ష్యం కారణంగా సముద్ర తీరం కలుషితం అవుతోంది. రసాయనిక వ్యర్థాలు, ప్లాస్టిక్ తదితర పదార్థాలను తిని సముద్ర తాబేళ్లు మృతిచెందుతున్నాయి. సముద్ర జలాలను శుద్ధి చేసి పర్యావరణాన్ని కాపాడే తాబేళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సముద్ర తీర ప్రాంతం కలుషితం కాకుండా చూడాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



తాబేలు పిల్లలను సముద్రంలో వదులుతున్న అధికారులు, సిబ్బంది

వ్యర్థాలతో కడలి కలుషితం

- మృతిచెందుతున్న అలివ్‌రిడ్లీ తాబేళ్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు
- పట్టించుకోని అధికారులు

వాకాడు : సముద్రపు తాబేలును చూస్తే మనకు గుర్తుకు వచ్చేది కూర్మావతారం. ఇది గ్రీకులకు జ్ఞాన చిహ్నం. దీన్ని ఆంగ్లంలో అలివ్‌రిడ్లీ అంటారు. ఈ తాబేలు పురాతన కాలం నుంచి జీవిస్తోంది. మానవుడికి ఎన్నో రకాలుగా సేవలు అందిస్తున్న జీవి సముద్రపు తాబేలు. ఇవి సముద్ర జలాల్లోని పాచి, మొక్కలు వివిధ వ్యర్థపదార్థాలను తింటూ సముద్రం కలుషితం కాకుండా చూస్తాయి. సముద్ర జీవరాశులు అంతరించి పోకుండా కాపాడుతున్నాయి. సముద్రంలో ఆక్సిజన్ పెంచేందుకు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి గుడ్లు పెట్టే సమసయలో తీరంలో ఒక రకమైన జెల్‌ను విడుదల చేస్తాయి. అది భూమిలో బంకలా అతుక్కుపోయి విపత్తుల సమయంలో తీరం కోతకు గురికాకుండా నివారిస్తుంది. ఇవి సాధారణంగా ప్రతి ఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో సముద్ర తీరానికి వచ్చి గుడ్లు పెడతాయి. తర్వాత అవి సముద్రంలోకి వెళ్లిపోతాయి. ఈ క్రమంలో తాబేళ్ల సంరక్షణకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వన్యప్రాణి విభాగం సూళ్లూరుపేట డివిజన్ అధికారులు వాకాడు మండలం తీర ప్రాంత గ్రామాలైన వైట్‌కుప్పం, పూడి కుప్పం, శ్రీనివాసపురం, నవాబుపేట తదితర సముద్ర తీరాల్లో 2012లో ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా అధిక మొత్తంలో గుడ్లను సేకరించి ప్రత్యేక హేచరీల ద్వారా పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు. గుడ్లు 45 నుంచి 60 రోజుల్లో పిల్లలుగా తయారవుతాయి. ఈ తాబేళ్ల అనంతరం వాటిని సముద్రంలో విడిచి పెడుతున్నారు. ఇప్పటి వరకు 1,05,645 గుడ్లను సేకరించి 97,328 వరకు పిల్లలను సముద్రంలోకి వదిలినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. తాబేళ్ల అభివృద్ధికి ట్రీ ఫౌండేషన్ అధికారులకు సహకారం అందిస్తోంది.

కలుషితమవుతున్న సముద్ర జలాలు

సముద్ర తీరంలో ఉన్న రొయ్యల హేచరీస్‌లు, రొయ్యల చెరువుల నుంచి వచ్చే రసాయనిక వ్యర్థాలను నిర్వాహకులు సముద్రంలోకి వదులుతున్నా రు. అలాగే సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలను అక్కడే వదిలేసి వెళుతున్నారు. గుడ్లు పెట్టి సంతానోత్పత్తి పెంచుకునేందుకు తీరానికి వచ్చే తాబేళ్లు వ్యర్థాలను తిని జీర్ణశక్తిని కోల్పోయి ఊపిరాడక మృత్యువాత పడుతున్నాయి. అంతేగాక కడలూరు, పాండిచ్చేరికి చెందిన మరబోట్ల నిర్వాహకులు ఈ ప్రాంతంలో తీరానికి దగ్గరగా వచ్చి చేపల వేటను కొనసాగిస్తున్నా రు. దీంతో తాబేళ్లు స్టీమ్ బోట్లు యంత్రాలకు తగిలి మృతిచెందుతున్నాయి. సాధారణంగా మరబోట్లు తీరం నుంచి 9 నాటికల్ మైళ్ల దూరం పైన చేపల వేట చేపట్టాలి. నిబంధనలను ఉల్లంఘించి చేపల వేట సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఆలీవ్‌రిడ్లీ తాబేలు ప్రత్యేకతలు

ఆలీవ్‌రిడ్లీ తాబేలు 3 అడుగుల పొడవు, 1.5 అడుగుల వెడల్పు ఉంటుంది. ఇది సుమారు 45 కిలోల వరకు బరువు ఉంటుంది. ఈ తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి ఏ మార్గం నుంచి వదులుతామో అవి పెద్దాయ్యాక గుడ్లు పెట్టే సమయానికి అదే స్థావరానికి రావడం ప్రత్యేకత. తాబేళ్లను చంపినా, వాటి గుడ్లను తిన్నా, ధ్వంసం చేసినా వన్యప్రాణి చట్టం 1972 కింద నేరంగా పరిగణిస్తారు. ఈ విషయంలో నేరం రుజువైతే 3 నుంచి 7 ఏళ్ల జైలు శిక్ష విధిస్తారు.

మరబోట్లు తగిలి చనిపోతున్నాయి



సముద్రపు తాబేళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది. కొందరు సముద్రంలోకి వ్యర్థాలను వదిలి పెట్టడంతోపాటు 1996 చట్టాన్ని ఉల్లంఘించి తీరానికి దగ్గరగా మరబోట్లు నడుపుతుండడంతో వాటికి తగిలి మృత్యువాత పడుతున్నాయి. మరబోట్లను ఆపాలని పలుమార్లు మెరైన్ డీఎస్పీకి పిర్యాదు చేసినా ఫలితం లేదు.

- గాయం శ్రీనివాసులు, రెగ్యులర్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, కొత్తపట్నం

టీడీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం



కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిసిన సంజీవయ్య, సత్యనారాయణ రెడ్డి, నియోజవర్గ నాయకులు

నాయుడుపేట టౌన్ : టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పనిచేస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన శుక్రవారం డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నియోజవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి నెల్లూరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిశారు. ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సంజీవయ్య మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంతోపాటు ప్రజల దృష్టి మరల్చేందుకు తిరుమల లడ్డూ కల్తీ పేరుతో అసత్య ప్రచారం చేస్తున్నట్టు దుయ్యబట్టారు. సర్వోన్నత న్యాయస్థానం గట్టిగా బుద్ధి చెప్పడంతో నిస్సిగ్గుగా యూ టర్న్ తీసుకున్నారని విమర్శించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. వివిధ మండలాల కన్వీనర్లు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, అనిల్ రెడ్డి, ఆర్ముగం, పాదర్తి హరినాథ్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీలు ధనలక్ష్మీ, పోలం శేఖర్ రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, ఓజిలి మండల మాజీ కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బట్టా పృథ్వీకుమార్‌యాదవ్, సర్పంచ్ కొండూరు ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన యువనేత



పెళ్లకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని పెళ్లకూరు మండల యువత అధ్యక్షుడు ఓడూరు వినోద్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో పార్టీ పరిస్థితులను, టీడీపీ నాయకుల అరాచకాలను మాజీ మంత్రి కాకాణికి వివరించారు.

రోడ్డుపై కొండ చిలువ



గూడూరు రూరల్ : నెలటూరు సమీపంలో ఉన్న నిమ్మ మార్కెట్టు రోడ్డుపై శుక్రవారం కొండ చిలువ కనిపించడంతో వాహనదారులు భయాందోళన చెందారు. ఆ ప్రాంతంలో చెట్ల పొదలు ఎక్కువగా ఉన్నాయి. కొండ చిలువ రోడ్డుకు ఇటు వైపు నుంచి అటు వైపు పాకుతూ పోతుండడాన్ని వాహనదారులు గమనించారు. భయాందోళనతో వాహనాలను ఆపేశారు. అది వెళ్లిపోయిన తర్వాత వాహనాలను కదిలించారు.

కంటి అద్దాల పంపిణీ



మహిళకంటి అద్దాలు అందజేస్తున్న జిందాల్ పవర్ సింహపురి యూనిట్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు

చిల్లకూరు : మండలంలోని తమ్మినపట్నంలో కంటి చూపు తక్కువగా ఉన్న 32 మందికి శుక్రవారం జిందాల్ పవర్ సింహపురి యూనిట్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు కంటి అద్దాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమ సీఎస్‌ఆర్ నిధులతో తీర ప్రాంత గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి చూపు తక్కువగా ఉన్న వారికి అద్దాలు అందజేయడంతోపాటు అవసరమైన వారికి నెల్లూరులోని కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం, పరిశ్రమ ప్రతినిధులు శ్రీకాంత్, నాయకులు సతీష్‌యాదవ్, మత్స్యకార మాజీ కాపు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు వెల్లువెత్తిన వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

కలువాయి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేందర్ రెడ్డి, అదాలత్ చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆదూరుపల్లి సబ్ స్టేషన్ నుంచి కలువాయికి విద్యుత్ సరఫరా అవుతుందని, వర్షాలు కురిసిన సమయంలో అంతరాయం ఏర్పడుతుదని తెలిపారు. గతంలో ఆత్మకూరు నుంచి బ్యాక్ ఫీడింగ్ చేసి వెంటనే సరఫరా ఇచ్చేవారని పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం బ్యాక్‌ఫీడింగ్ లైను టవర్లు దెబ్బతినడంతో సరఫరా నిలిచి పోయిందన్నారు. కలువాయి మండలాన్ని నెల్లూరు రూరల్ డివిజన్ పరిధిలో పొదలకూరు సబ్‌డివిజన్‌లో కలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకయ్యస్వామి నగర్, జర్నలిస్టు కాలనీ ప్రాంతాల్లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

సూళ్లూరుపేట రూరల్ : విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మిదేవి తెలిపారు. ఆమె శుక్రవారం సూళ్లూరుపేట మండలంలోని కేసీఎన్‌గుంట పంచాయతీలో పొలంబడి కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం ద్వారా వరి పంటకు అగ్గి తెగులు, పాము పొడ తదితర తెగుళ్లు రాకుండా నివారించవచ్చని తెలిపారు. ఏవోలు కవిత, శశిధర్‌రెడ్డి, సుభాషిణి, అనూరాధ, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి



హేమంత్ కుమార్

వెంకటగిరి రూరల్ : రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వెంకటగిరి పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి కె.హేమంత్ కుమార్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తులసిజ్యోతి తెలిపారు. నెల్లూరులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో అండర్ 14 విభాగం లాంగ్ జంప్‌లో విద్యార్థి ప్రతిభ చూపినట్టు పేర్కొన్నారు. అండర్ 17లో సిహెచ్ మునిలాస్య, సాత్విక్, అండర్ 14లో కె రమేష్ ప్రతిభ చూపినట్టు వెల్లడించారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

గూడూరు రూరల్ : విందూరులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని శుక్రవారం రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 1039–1లో సుమారు 3.71 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారు. ఈ విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాలతో వీఆర్వో శివకుమార్ బోర్డును ఏర్పాటు చేశారు.

'పొలం పిలుస్తోంది'పై సమీక్ష

చిల్లకూరు : ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఏవో భవాని వ్యవసాయ సహాయలను ఆదేశించారు. ఆమె శుక్రవారం ఉద్యానవన శాఖాధి కారి కార్తీక్‌తో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమంపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో రైతులు బోర్ల కింద పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. వాటిని ఆశించే తెగుళ్లపై అవగాహన కల్పించాలన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

పెళ్లకూరు: ఎంపీడీవోగా ఎ.ప్రమీలారాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె సూళ్లూరుపేట ఎంపీడీవోగా పనిచేస్తూ ప్రమీలారాణి బదిలీపై పెళ్లకూరు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్ బాబు నాయుడుపేటకు బదిలీ అయ్యారు. ఆమెను ఏవో అన్నపూర్ణారావు, వివిధ పంచాయతీల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

నాయుడుపేట ఎంపీడీవో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఎంపీడీవోగా కోటూరు సురేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పెళ్లకూరులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు ఇన్‌చార్జి ఎంపీడీవో భువనేశ్వర శర్మ బాధ్యతలు అప్పగించారు.

వెంకటగిరి మున్సిపల్ కమిషనర్..

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా నరేంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ అబ్దుల్‌షరీఫ్ ఈ నెల 2న బదిలీ అయ్యారు. నరేంద్రకుమార్ మాట్లాడుతూ తాను గతంలో ఇక్కడ పనిచేశానని, అధికారులను సమన్వయం చేసుకుని వెంకటగిరి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఈవోపీఆర్‌డీ ..

గూడూరు రూరల్ : ఈవోపీఆర్డీగా మోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఓజిలిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

7 నుంచి బస్సు పాసుల జారీ

వెంకటగిరి రూరల్ : ఈ నెల 7వ తేదీ నుంచి విద్యార్థుల బస్సు పాసులతోపాటు సీజన్ పాసులు జారీ చేయనున్నట్టు వెంకటగిరి ఆర్టీసీ డీపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. పాసుల జారీకి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 5, 6 తేదీల్లో పాసుల జారీ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తపాలా ఉద్యోగుల నిరసన

కోట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు శుక్రవారం విద్యానగర్ పోస్టాఫీసు వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం దిగిరాని పక్షంలో ఈ నెల 9న గూడూరులో మహాధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ గూడూరు డివిజన్ కార్యదర్శి శ్రీనివాసతేజ పాల్గొన్నారు.

పసుపు కొమ్ముల అలంకారంలో ముత్యాలమ్మ











వెంకటగిరి రూరల్: రాజరాజేశ్వరిగా మందనాంచారమ్మ, గాయత్రిదేవిగా కాత్యాయిని, కుర్మావతారంలో వెంకటేశ్వరస్వామి. రాజరాజేశ్వరి అలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు, నెమలి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



గాయత్రి దేవిగా దుర్గామల్లేశ్వరిదేవి

చిల్లకూరు/సైదాపురం/కోట/రాపూరు/వెంకటగిరి రూరల్/నాయుడుపేట టౌన్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పలుచోట్ల ఘనంగా జరుపుకుంటున్నారు. రెండో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు.

- చిల్లకూరు మండలంలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం పసుపు కొమ్ముల అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారు పెద్ద ముత్తయిదువని, అందుకే పసుపు కొమ్ముల అలంకారంలో దర్శనమిచ్చినట్టు అర్చకులు శివ కుమార్ స్వామి తెలిపారు.

సైదాపురంలో వెలసిన శ్రీబాలా త్రిపుర సుందరిదేవి అమ్మవారు శుక్రవారం అన్నపూర్ణగా భక్తులను అనుగ్రహించారు. ఉదయం అభిషేకం, పూలంగి సేవ చేశారు. లలితా సహస్ర పారాయణం, రుద్రాభిషేకం నిర్వహించారు.

- చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ శుక్రవారం అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా యరటపల్లి జానకిరామిరెడ్డి దంపతులు వ్యవహరించారు. అలాగే కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీ అమ్మవారు ఆదిలక్ష్మీగా భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా చినకటువపల్లికి చెందిన దువ్వూరు వెంకటరామిరెడ్డి వ్యవహరించారు.
- కోట గ్రామదేవత కోటమ్మ శుక్రవారం తారాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరిగా పూజలందుకున్నారు.
- రాపూరు మండలం పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవి అమ్మవారు శుక్రవారం రాత్రి ఆదిలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి తిరుచ్చిపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం చేశారు. వేపినాపి సమీపంలోని వెలసిన అంకమ్మ బాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులను అనుగ్రహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. రాపూరు గ్రామ దేవత రాపూరమ్మ గాయత్రీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. అలాగే పర్వతివర్ధని అమ్మవారిని శైలేంద్రదేవిగా అలంకరించారు.
- వెంకటగిరి పట్టణం వెలమపాళెం సమీపంలో ఉన్న మందనాంచారమ్మ, కన్యకా పరమేశ్వరి అమ్మవార్లు రాజరాజేశ్వరిదేవిగా, నెమలి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. కర్ణకమ్మవీధిలోని కాత్యాయని అమ్మవారు గాయత్రీ దేవిగా, హరిహర క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ, ముకాంబికాదేవి అమ్మవార్లు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులను అనుగ్రహించారు. స్వర్ణముఖి నదీ తీరంలో ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి అమ్మవారు గాయత్రీ దేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు.
- చిట్టమూరు(వాకాడు); మండలంలోని మల్లాంలో ఉన్న కామాక్షిదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. దీనికి ఉభయకర్తలుగా కందుకూరు బాలసుబ్రమణ్యం, ఉమామహేశ్వరి దంపతులు వ్యవహరించారు.

గాయత్రీగా చెంగాళమ్మ పరమేశ్వరి



గాయత్రీ అలంకారంలో చెంగాళమ్మ పరమేశ్వరి

సూళ్లూరుపేట : శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు గాయత్రీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. యాగశాలలో మహా చండీయాగం చేశారు. అలంకారానికి నెల్లూరుకు చెందిన గునపాటి మురళీకృష్ణారెడ్డి, ప్రతిమ దంపతులు, చండీ యాగానికి చెన్నైకి చెందిన అనంతరాజు ఉమామహేశ్వరరావు, లక్ష్మీ సుభద్ర దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సూళ్లూరుపేటకు చెందిన రాయుడు బృందం సినీ సంగీత, నృత్య ప్రదర్శన ఇచ్చారు.

ఘనంగా సారెలు సమర్పణ

అమ్మవారికి శ్రీనగర్ కాలనీ, సూళ్లూరు గంగమిట్ట, కాపువీధి, కావలివీధి, శ్రీ పొట్టి శ్రీరాములు వీధి, రైల్వేకాలనీకి చెందిన భక్తులు సారెలు సమర్పించారు. మహిళలు చీరలు, రవికెలు, పండ్లు, పసుపు, కుంకుమ తీసుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మీ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వేనాటి రామచంద్రారెడ్డి, వేనాటి సురేష్‌రెడ్డి, పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మారంరెడ్డి మునీష్‌రెడ్డి, ఎంవీ రమణయ్య, వాకాటి బాబురెడ్డి, చిల్లకూరు సురేష్‌రెడ్డి, రాయం రమేష్‌నాయుడు, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారె తీసుకువస్తున్న శ్రీనగర్‌కాలనీకి చెందిన మహిళలు



సారె తెస్తున్న సూళ్లూరుపేట కాపువీధి, సూళ్లూరు గంగమిట్ట ప్రాంతానికి చెందిన మహిళలు



ఆదిలక్ష్మీగా కలవకొండ ఆదిలక్ష్మీ దేవి



చిల్లకూరు : పసుపు కొమ్ముల అలంకారం..



సైదాపురం : అన్నపూర్ణగా అమ్మవారు



కోట: తారాదేవిగా కోటమ్మ



రాపూరు: ఆదిలక్ష్మి దేవి అలంకరణలో ఆదిలక్ష్మిదేవి



బాలా త్రిపుర సుందరిగా అంకమ్మతల్లి